**నాకు పెళ్ళయి తొమ్మిది సంవత్సరాలయింది. మా తల్లిదండ్రులు కట్నం యిచ్చుకోలేక, పిల్లలు పుట్టకముందే పెళ్ళాం చనిపోయినవాడికి పెళ్ళాన్ని చేశారు నన్ను. ఏ కొంచెం మాధుర్యం మిగల్చకుండానే ఇద్దరు పిల్లలు నా పేగుల్ని తెంచుకున్నారు. ఇన్ని సంవత్సరాలయినా, సంసారం పెరుగుతున్నా, ఆయన తాగడం మానలేదు. ఇంటి గురించి పట్టించుకునేవాడు కాదు.**

పనికనిపోయి, రాత్రిపూట ఏ పదకొండు గంటలకో ఇంటికొచ్చేవాడు. జేబులో చిల్లర డబ్బులు మాత్రమే మిగిలేవి. ఏం జరిగినా, జరగక పోయినా నోరుమూసుకుని పడుండే తెలుగింటి ఆడపడుచులాగానే, నేనూ భరిస్తూ వుండేదాన్ని. మా సంసార భారం కూడా మా అత్తామామల మీద పడడంతో మమ్మల్ని వేరు కాపురం పెట్ట మన్నారు. ఊరు చివర ఓ చిన్న ఇంటిని అద్దెకు తీసుకున్నాం. నా రెక్కల్ని ముక్కలు చేసు కుంటేనే గాని మా సంసారం సాగడం లేదు. ఇంట్లోకి ఏం కావాలన్నా, అప్పుచేసి తీర్చడం నా వంతయింది. మా పక్క ఇంటిలో అద్దెకుంటున్న సూర్యం, అప్పు ఎప్పుడడిగినా లేదనకుండా చివరకు తనకు తెలిసినవాళ్ళను అడిగి తీసుకునైనా ఇస్తాడు. అతనికి పందొమ్మిదేళ్ళుంటాయి. దగ్గరలో వున్న ఫ్యాక్టరీలో పని చేస్తాడు. అతనెంతో ప్రశాంతంగా వుండేవాడు. అంత ప్రశాంతంగా ఎలా వుండగలుగుతున్నాడో అర్థమయ్యేది కాదు. ఏది ఏమైనా అతని మాటలు వినబుద్ధి అయ్యేది. మా ఆయన కూడా అతన్ని అభిమానించేవాడు. తాగవద్దని మా ఆయనకి చాలాసార్లు చెప్పి చూశాడు అతను.

రాను రాను మా ఆయనకీ, నాకూ మధ్య మాటలు తగ్గుతున్నాయి. ఇదివరకు పడక విషయంలో బలవంతపెట్టేవాడు. ఇక్కడకొచ్చిన తర్వాత ఆయన అంతగా బలవంతపెట్టడమూ లేదు. బలవంతపెట్టినా నేను వూరుకోవడం లేదు. దూరంగా పిల్లల దగ్గర పడుకుంటున్నాను. బహుశా నేను పనికెళ్ళడం వల్ల అలిసిపోయి, నిద్రని కోరుకోవడం కూడా కారణం కావచ్చు.

అప్పుడప్పుడు సాయంత్రం పూట మా ఆయన వాళ్ళ పిన్ని కొడుకు రాంబాబు, ఊరు ఆ చివర నుంచి మా ఇంటికొచ్చేవాడు. పిల్లలతో కబుర్లాడేవాడు. మా ఆయన ఇంటికి వచ్చేదాకా వుండి మాట్లాడి వెళ్ళేవాడు. నాతో చనువుగా వుండేవాడు.

ఓ సాయంత్రం పూట పొద్దు గూకేవేళ పని నుంచి ఇంటికొచ్చాను. బడి నుంచి వచ్చిన మా పిల్లలిద్దరితో వసారాలో రాంబాబు కబుర్లు చెబుతున్నాడు. వాళ్ళని పలకరించి, వంట చెయ్యడంలో నిమగ్నమయ్యాను. వంటయిన తర్వాత పిల్లలకి స్నానం చేయించి, అన్నం తినిపించి, పడుకోబెట్టాను. మధ్యమధ్యలో రాంబాబు కబుర్లు చెబుతూనే వున్నాడు. రాంబాబుకి భోజనం పెట్టి, తర్వాత నేనూ తిన్నాను. ఇక మా ఆయనే భోంచేయాలి. ఇంకా రాలేదు. ఎప్పుడొస్తాడో ... వచ్చిన తర్వాత అన్నం పెట్టాలి కాబట్టి ఎదురుచూస్తూ, పెరటి తలుపు వేద్దామని వెనుక గదిలోకి వెళ్ళాను. ఎప్పుడు చుట్టుకున్నాయో రెండు బలమైన చేతులు ... నాకు ఊపిరిరాడనంతగా ... బలవంతంగా ముఖం పైకెత్తితే ... రాంబాబు ... నా నోరు పెగలదు ... విదిలించుకుందామని ఎంతగా ప్రయత్నించానో... నా వల్లకాలేదు. అలాగే పట్టుకుని నన్ను ఇంటి వెనుకవైపుకి తీసుకెళ్ళాడు ... ఎంతయినా ఆడదాన్ని. పైగా పనికెళ్ళొచ్చి అలిసిపోయి వున్నాను... ప్రతిఘటించలేని నిస్సహాయత నాలో పెళ్ళితోనే మొదలయిందేమో ... పెనుగులాడలేకపోయాను. అందులోనూ 'కోరిక' పట్ల ఇష్టంగానీ, వ్యతిరేకతగానీ లేని స్థితిలో ఇన్నేళ్ళు బ్రతుకుతున్నానేమో... పోరాడలేక లొంగిపోయాను. అయితే అలా జరిగినందుకు నేనేమీ కుంగిపోలేదు. బాధపడలేదు. సిగ్గుపడలేదుకూడా. మగవాడు అంత నీచానికి దిగిన తర్వాత ... సొంత భార్య అయినా సరే ... బలాత్కారం ... ఛ! ... అంత నీచం ... సిగ్గుపడాలనేదుంటే అతనే పడాలి. ఆ సంఘటన నాలో కొత్త మార్పేమీ తీసుకురాలేదు. అతను మామూలుగా వస్తూనే వున్నాడు. నేను ముభావంగా వుంటున్నాను.

నాకెప్పుడైనా మాట్లాడాలనిపిస్తే, మాట్లాడేది సూర్యంతోనే. నవ్వించేవాడు. గలగలమని మాట్లాడేవాడు. ఎక్కువగా వినడమే నా పని. చాలాసార్లు సూర్యం మా సంసార విషయాల్ని ప్రశ్నించినా నేనేమీ చెప్పేదాన్ని కాదు. నా చికాకు జీవితాన్ని చెప్పి అతన్ని కలతపరచడం నాకు ఇష్టం లేదు. తర్వాత తర్వాత ప్రశ్నించడం మానేశాడు. తన విషయాలు నాకు చెప్పినట్లుగా, నా విషయాలు తనకి చెప్పనందుకు "అంతేలే" అనేవాడు. నేను వంట చేసుకునేటప్పుడో, మరేదైనా పనిలో నిమగ్నమై వున్నప్పుడో దొంగచాటుగా వచ్చి కళ్ళు మూసేవాడు. అతని మెత్తని చేతుల్ని వెంటనే గుర్తుపట్టేదాన్ని. మా మాటల మధ్య, నవ్వుల మధ్య, చిలిపి కొట్లాటల మధ్య మా చేతులు, భుజాలు కలిసేవి. అల్లరిచేసి, అలిగి, నా ఒడిలో పడుకునేవాడు. కౌగిలించుకునే వాడు. రోజులు గడిచేకొద్దీ నాలో అలజడి మొదలయింది. ఏ స్వప్నాలకు, ప్రణయావేశాలకు నేను కళ్ళు తెరవాలనుకున్నానో ... అవన్నీ ఇప్పుడు నా ముందు పరుచుకుంటున్నట్లు ... శరీరంలో ఓ కొత్త కదలిక. శరీర స్పర్శనే లెక్కలోకి తీసుకుంటే ... కాదు కాదు,'ఆ విధంగా'అయితే నా శరీరమెప్పుడో పాతదయిపోయింది. మొద్దుబారిపోయింది. తొలిగా నా హృదయాన్ని తాకింది అతనే. ఆ హృదయస్పర్శే నా శరీరానికి కొత్త ఉత్తేజాన్నిచ్చింది. జీవిత సాఫల్యమేమిటో ఇప్పుడు నాకు అర్థమౌతోంది. కోటి భావాల ప్రవాహం నాలో. ఇదివరకు అతన్ని చిన్నపిల్లాడిగా భావించేదాన్ని. కాని ఇప్పుడు నా హృదయంలో ప్రియుడి స్థానం అతనిది. ఇప్పుడు అతనికన్నా నేనే ఎక్కువగా మాట్లాడుతున్నాను.

ఓ రోజు మధ్యాహ్నం —

ఇంట్లో ఒంటరిగా వున్నాను. సూర్యం వచ్చాడు. నన్ను నవ్విస్తూ, అల్లరిచేస్తూ, మధ్య మధ్యలో నన్ను కౌగిలించుకుంటున్నాడు.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్

# స్పర్శ

— పులగం శివశంకర రావు



"ఒక్కసారి ..." అన్నాడు.

"వద్దు" అన్నాను.

"పోనీ మీ ఆయనతో సుఖపడుతున్నావా?"

"లేదు"

"ఎటూ నేనంటే యిష్టమేగా. అభ్యంతర మేంటి?"

"ఉంటే మాత్రం ... వేరొకరి పెళ్ళాన్నిగా"

"నా మీద యిష్టం యింతేనా?"

"పూర్తి యిష్టాన్ని తెలుపడానికి నీవు కోరిందే సరిపోతుందా?"

"మరి ఎట్లా?"

"చెప్పడం కష్టం"

"అదంతా కుదరదుగాని... రేపు సాయంత్రం వస్తున్నాను. తప్పదు" అంటూ వెళ్ళిపోయాడు.

అతను నన్నేమీ అడక్కుండా ఎంత ముందు కెళ్ళినా అభ్యంతర పెట్టేదాన్ని కాదు. కాని ఆ విషయానికి ప్రాముఖ్యతనిచ్చి అడిగేసరికి, ఆ ప్రాముఖ్యత అతనిలో పెంచడం కోసం, ఈసారికి దూరంగా వుంచాలని అలా ప్రవర్తించాను. అతను మరుసటి రోజు రాలేదు. పైగా పక్క వీధిలోకి మకాం మార్చాడు. మధురస్వప్నం విచ్ఛిన్న మౌతున్న భయం నన్ను ఆవరించింది.

ఓ రోజు అతని గదికి వెళ్ళాను.

"ఏంటి రాలేదు?" అన్నాను.

"ఎందుకు?"

"నా కోసం"

"వద్దన్నావుగా"

"వద్దన్నంత మాత్రానికే యిష్టం పోయిందా?"

"ఇష్టం వున్నా, నువ్వు వేరొకరి భార్యవుగా"

"ముందు తెలియదా?"

"తెలుసు"

"మరి వస్తానని ఎందుకురాలేదు?"

"నువ్వే రావాలని ... నీ యిష్టం తెలుసుకుందామని"

"చిలిపిదొంగా" అంటూ అతన్ని ముద్దు పెట్టుకోబోయాను.

"వద్దు, ఆగు!"

"ఏం?"

"కోరిక మీద ఇష్టం ఇప్పుడు కలిగిందా?"

"నీ మూలంగానే"

"అదే నాకు నచ్చలేదు"

"ఎందుకని?"

"నేను ఇష్టం చూపిన తర్వాత నువ్వు ఇష్టం చూపడం" అన్నాడు.

నేనేమీ మాట్లాడలేకపోయాను. ఏదో ఉద్వేగం గొంతుకు అడ్డుపడింది.

కొన్ని క్షణాల మౌనం తర్వాత "ఆ రాత్రి మీ ఇంటి వెనుక రాంబాబుతో నిన్ను చూశాను" అన్నాడు.

నాకు చాలా ఆశ్చర్యమేసింది. వెంటనే తమాయించుకుని "అతని బలవంతం వల్ల అలా జరిగింది" అన్నాను.

"అలా చేసి కూడా మళ్ళీ మీ యింటికెలా వస్తున్నాడు?"

"నేను పట్టించుకోదల్చుకోలేదు"

"ఆ పట్టించుకోకపోవడమే నీ సంసారంలో నువ్వు చేసిన పెద్ద పొరపాటు"

"ఎందుకని?"

"మీ ఆయన మీది అసంతృప్తితో మీ ఆయన సుఖాన్ని, నీ సుఖాన్ని నువ్వు పట్టించుకోలేదు. అది ఆసరాగా తీసుకునే రాంబాబు బలాత్కారం, నా చొరవ. నీ పట్ల ఇష్టాన్ని చూపితే, నువ్వు నా కోసం వచ్చినట్లే, మీ ఆయన పట్ల ఇష్టాన్ని చూపితే ఆయన కూడా నిన్ను బట్టి యిష్టాన్ని చూపేవాడు. తను మారేవాడు" అన్నాడు.

అతని ఉద్దేశ్యం అర్థమయింది. మాట్లాడడానికి నా దగ్గర మాటలు మిగల్లేదు. అతని ముఖం చూడాలంటే, చాలా సిగ్గేసి మా ఇంటి కొచ్చాను.

☆